## మనవడితో రంగుల పండుగ



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి హోలీ వేడుకలు జరుపుకున్నారు. రేవంత్ కుమార్తె నైమిష కుమారుడు రేయాన్ష్‌తో కలిసి కలిసి సరదా సరదాగా గడిపారు. మనవడికి రంగులు పూస్తూ, చిన్నారితో పూయించుకుంటూ మైమరచిపోయారు. వేడుకల్లో రేవంత్ రెడ్డి అర్ధాంగి గీతారెడ్డి కూడా పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ టికెట్లలో బీసీలకు పెద్దపీట

- ఎంపీ జనరల్ స్థానాల్లో సగం వారికే
- రిజర్వ్ స్థానాల్లోనూ సమన్యాయం
- ఇద్దరు మహిళలు, మరో ఇద్దరు మాజీ సివిల్ సర్వెంట్లకు అవకాశం
- హైదరాబాద్ అభ్యర్థిగా గడ్డం శ్రీనివాస్‌యాదవ్

హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ): ఎంపీ అభ్యర్థుల ఎంపికలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సామాజిక సమతూకం పాటించారు. రాష్ట్రంలోని మొత్తం 17 స్థానాలకు సామాజిక సమతూకం పాటిస్తూనే ప్రజాబలం ఉన్న నేతలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఇటీవలి అసెంబ్లీ ఫలితాల అనంతర పరిస్థితుల్లో రాష్ట్రవ్యాప్తంగా కేసీఆర్ పాలనను ప్రజలు తిరిగి గుర్తు చేసుకుంటున్నారు.ఈ నేపథ్యంలో పార్లమెంట్ ఎన్నికల్లో విజయదుందుభి మోగించేందుకు బీఆర్ఎస్ సన్నద్ధమవుతున్నది. ఇప్పటికే కొందరు అభ్యర్థులు తమ నియోజకవర్గాల్లో పర్యటిస్తుండగా వారికి ప్రజల నుంచి అనూహ్య మద్దతు లభిస్తున్నది. పార్టీ ముఖ్యనేతలు, ప్రజాప్రతినిధులు అన్ని ఎంపీ స్థానాల్లో విస్తృత ప్రచారాన్ని చేపట్టేందుకు సమాయత్తమవుతున్నారు. మరోవైపు, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ త్వరలోనే రంగంలోకి దిగనున్నట్టు సమాచారం.



### హైదరాబాద్ అభ్యర్థిగా గడ్డం శ్రీనివాస్‌యాదవ్

హైదరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా గడ్డం శ్రీనివాస్‌యాదవ్‌ను పార్టీ అధినేత కేసీఆర్ సోమవారం ప్రకటించారు. నియోజకవర్గ పరిధిలోని ప్రజాప్రతినిధులు, పార్టీ ప్రతినిధులతో చర్చించిన అనంతరం కేసీఆర్ అభ్యర్థిని నిర్ణయించారు.

రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి బీఆర్ఎస్ అభ్యర్థుల విజయానికి ప్రజా మద్దతును కూడగట్టనున్నారు.

**రిజర్వ్ స్థానాల్లోనూ సమతూకం**

రిజర్వ్ స్థానాల అభ్యర్థుల ఎంపికలోనూ కేసీఆర్ సమతూకం పాటించారు. ఎస్టీల్లో ఆదివాసీ, మైదాన గిరిజనులకు సమాన అవకాశాలు కల్పించారు. ఆదిలాబాద్ స్థానాన్ని ఆదివాసీ (గోండు) గిరిజనులకు, మహబూబాబాద్‌ను మైదానప్రాంత గిరిజనులకు (బంజారా/లంబాడా) కేటాయించటం విశేషం. ఎస్సీ నియోజకవర్గాల్లో రెండు స్థానాలను మాదిగ (నాగర్‌కర్నూల్, వరంగల్) సామాజిక వర్గానికి, పెద్దపల్లి లోక్‌సభ స్థానాన్ని మాల సామాజిక వర్గానికి కేటాయించారు. తద్వారా సమాజంలోని అన్ని సామాజికవర్గాలకు తాము మాత్రమే అవకాశం కల్పిస్తామని బీఆర్ఎస్ మరోసారి నిరూపించిందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. రిజర్వ్‌స్థానాల్లో రెండింటిని వరంగల్ (ఎస్సీ), మహబూబాబాద్ (ఎస్టీ) మహిళలకు కేటాయించడం మరో విశేషం.

**ఎన్నికల బరిలో ఇద్దరు మాజీ సివిల్ సర్వెంట్లు**

బీఆర్ఎస్ ఈసారి ఇద్దరు మాజీ సివిల్ సర్వెంట్లకు అవకాశం కల్పించింది. నాగర్‌కర్నూల్ లోక్‌సభ అభ్యర్థిగా మాజీ ఐపీఎస్ అధికారి, బీఎస్పీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, మెదక్ స్థానానికి అదే జిల్లాలో కలెక్టర్‌గా పనిచేసి, తన పదవికి రాజీనామా చేసి, బీఆర్ఎస్ ఎమ్మెల్సీగా ఎన్నికైన పీ వెంకట్రామ్‌రెడ్డిని కేసీఆర్ బరిలో నిలిపారు.

**సామాజిక వర్గాల వారీగా బీఆర్ఎస్ టికెట్ల పంపిణీ ఇలా..**

రాష్ట్రంలో మొత్తం లోక్‌సభ స్థానాలు: 17

| | |
|---|---|
| బీసీ 6 | రెడ్డి 4 |
| వెలమ 1 | కమ్మ 1 |
| ఎస్సీ 3 (మాదిగ 2, మాల 1) | |
| ఎస్టీ 2 (ఆదివాసీ 1, బంజారా/ లంబాడా 1) | |

**బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితా**

| | |
|---|---|
| ఖమ్మం(జనరల్) | నామా నాగేశ్వర్‌రావు (ఓసీ) |
| మహబూబాబాద్ (ఎస్టీ) | మాలోత్ కవిత |
| కరీంనగర్(జనరల్) | బోయినపల్లి వినోద్‌కుమార్ (ఓసీ) |
| పెద్దపల్లి(ఎస్సీ) | కొప్పుల ఈశ్వర్ |
| మహబూబ్‌నగర్(జనరల్) | మన్నె శ్రీనివాస్‌రెడ్డి (ఓసీ) |
| చేవెళ్ల (జనరల్) | కాసాని జ్ఞానేశ్వర్ (బీసీ) |
| వరంగల్ (ఎస్సీ) | డాక్టర్ కడియం కావ్య |
| నిజామాబాద్(జనరల్) | బాజిరెడ్డి గోవర్ధన్ (బీసీ) |
| జహీరాబాద్ (జనరల్) | గాలి అనిల్‌కుమార్ (బీసీ) |
| ఆదిలాబాద్(ఎస్టీ) | ఆత్రం సక్కు (ఆదివాసీ) |
| మల్కాజిగిరి(జనరల్) | రాగిడి లక్ష్మారెడ్డి (ఓసీ) |
| మెదక్(జనరల్) | పీ వెంకట్రామిరెడ్డి (ఓసీ) |
| నాగర్‌కర్నూల్ (ఎస్సీ) | ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ |
| సికింద్రాబాద్(జనరల్) | టీ పద్మారావుగౌడ్ (బీసీ) |
| భువనగిరి(జనరల్) | క్యామ మల్లేశ్ (బీసీ) |
| నల్లగొండ(జనరల్) | కంచర్ల కృష్ణారెడ్డి (ఓసీ) |
| హైదరాబాద్(జనరల్) | గడ్డం శ్రీనివాస్‌యాదవ్ (బీసీ) |

**బీసీలకు అత్యధికం**

పార్టీ నిర్మాణంలో అయినా, అభ్యర్థుల ఎంపికలో అయినా సామాజిక సమతూకం అంటే బీఆర్ఎస్ పార్టీయేనని మరోసారి నిరూపించింది. ఎంపీ టికెట్లలో బీసీలకే సింహభాగం కల్పించింది. బీసీలకు ఆరు స్థానాలు కేటాయించింది. బీసీల్లో మున్నూరుకాపులకు రెండు (జహీరాబాద్, నిజామాబాద్) స్థానాలు కేటాయించింది. చేవెళ్ల స్థానాన్ని ముదిరాజ్‌లకు, సికింద్రాబాద్‌ను గౌడ సామాజికవర్గానికి, భువనగిరి స్థానాన్ని గొల్లకురుమలకు, హైదరాబాద్ స్థానాన్ని యాదవులకు కేటాయించింది. రెడ్డి సామాజిక వర్గానికి నాలుగు, వెలమ, కమ్మ సామాజికవర్గాలకు ఒక్కో స్థానాన్ని కేటాయించింది.

# కాంగ్రెస్ డబుల్ గేమ్?

- ఓవైపు ఎంఐఎంతో దోస్తీ
- మరోవైపు ఎంబీటీతో చర్చలు
- హైదరాబాద్ పార్లమెంట్‌పై కన్ను
- ఎంఐఎంను ఓడించాలని ప్లాన్

హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో కాంగ్రెస్ పార్టీ డబుల్ గేమ్ ఆడుతున్నదా? ఓవైపు ఎంఐఎంతో స్నేహం నటిస్తూ, మరో పార్టీతో లోపాయకారీ ఒప్పందం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నదా.? తాజా పరిణామాలను గమనిస్తే ఔననే అనిపిస్తున్నది. హైదరాబాద్ పార్లమెంట్‌లో ఎంఐఎంను దెబ్బ కొట్టేలా కాంగ్రెస్ విశ్వప్రయత్నాలు చేస్తున్నట్టు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ఇందుకోసం ఎంఐఎంకు పోటీగా భావిస్తున్న మజ్లిస్ బచావో తెహ్రీక్ (ఎంబీటీ) పార్టీతో కాంగ్రెస్ చర్చలు జరుపుతున్నట్టు సమాచారం. ఎంబీటీకి పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో మూడు చోట్ల బలమైన ఓటు బ్యాంకు ఉన్నది. ఎంఐఎం తమతో స్నేహం కోసం ప్రయత్నిస్తున్నదని కాంగ్రెస్ మంత్రులు పలుమార్లు ప్రకటించారు. హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలో ఆ పార్టీతో ఫ్రెండ్లీ పోటీ ఉంటుందని చెప్పారు. అయితే, స్నేహపూర్వక పోటీ కాకుండా ఎంఐఎంను ఓడించేందుకు అన్ని రకాల అవకాశాలను పరిశీలించాలని రాష్ట్ర కాంగ్రెస్ భావిస్తున్నట్టు తెలిసింది. ఇందులో భాగంగానే ఎంబీటీతో మొదటి దఫా చర్చలు పూర్తయ్యాయని, ఎంబీటీ మద్దతుతో మైనార్టీ ఓటుబ్యాంకును చీల్చవచ్చని, తద్వారా ఎంఐఎంను ఇరుకున పెట్టొచ్చని, అవసరమైతే ఓడించొచ్చని కాంగ్రెస్ భావిస్తున్నట్టు చర్చ జరుగుతున్నది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ముస్లింలు కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నారని, ఎంఐఎంను సొంత గడ్డమీద ఓడిస్తే ఓటు బ్యాంకు మరింత బలపడుతుందని లెక్కలు వేసుకుంటున్నారట. అంతేకాకుండా.. ఎంఐఎంను నమ్మలేమని, ఎప్పుడూ తన స్వార్థం కోసం అధికారంలో ఉన్న పార్టీతో స్నేహం నటిస్తుందే తప్ప ఎవరితోనూ నిజమైన భాగస్వామిగా ఉండదని కాంగ్రెస్ పెద్దలు విశ్వసిస్తున్నట్టు సమాచారం. ఇప్పటికే గత అసెంబ్లీ సమావేశాల్లో ఓ సందర్భంలో 'మీరు ముస్లింలందరికీ ప్రతినిధి కాదు' అని అక్బరుద్దీన్ ఓవైసీని ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. దీనికి కొనసాగింపుగానే ఎంబీటీతో చేతులు కలిపేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఎంబీటీని 1993లో మహ్మద్ అమానుల్లాఖాన్ స్థాపించారు. ఎంఐఎం అధ్యక్షుడు సలావుద్దీన్ ఓవైసీతో విభేదించి సొంతంగా పార్టీ నెలకొల్పారు. అప్పటి నుంచి పాత బస్తీలో ఎంఐఎంకు ప్రత్యామ్నాయంగా ఈ పార్టీ ఎదుగుతున్నది. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో మంచి ఓటు బ్యాంకు ఉండగా, ముఖ్యంగా యాకత్‌పురాలో బలంగా ఉన్నది. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 878 ఓట్ల తేడాతో అక్కడ సీటును కోల్పోయింది. దీంతోపాటు చాంద్రాయణగుట్ట, మలక్‌పేటలోనూ పార్టీకి మంచి పట్టున్నది.

## బీజేపీ నియంతృత్వ పాలనపై పోరాటం

**30న రాష్ట్ర సదస్సు • వామపక్ష పార్టీల రాష్ట్ర కమిటీల ప్రకటన**

హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ) : ప్రజాసమస్యలు పరిష్కరించడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందని 11 వామపక్ష పార్టీల రాష్ట్ర కమిటీలు విమర్శించాయి. ప్రజల దృష్టిని పక్కదోవ పట్టిస్తూ, మతోన్మాద విధానాలను ముందుకు తెస్తున్న బీజేపీ నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా ఈనెల 30న హైదరాబాద్‌లో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రకటించాయి. ఈ మేరకు సోమవారం ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి. ప్రతిపక్షాలు పాలిస్తున్న రాష్ట్రాల్లోని గవర్నర్ వ్యవస్థను తమ స్వార్థ ప్రయోజనాలకోసం వాడుకుంటూ అక్కడి ప్రభుత్వాలను పడగొడుతున్నదని, రాజ్యాంగానికి విరుద్ధంగా 'పౌరసత్వ సవరణ చట్టం 2019'(సీఏఏ)ను తెచ్చిందని మండిపడ్డాయి. ఈ నేపథ్యంలో బీజేపీ ప్రజా వ్యతిరేక, మతోన్మాద, కార్పొరేట్ విధానాలను నిరసిస్తూ మార్చి 30న ఉదయం 10 గంటలకు హైదరాబాద్ సుందరయ్య విజ్ఞానకేంద్రంలో రాష్ట్ర సదస్సు నిర్వహించి, రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత క్యాంపెయిన్‌కు కార్యాచరణను రూపొందించనున్నట్టు వెల్లడించాయి. ఈ సదస్సులో ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని 11 వామపక్ష పార్టీల రాష్ట్ర కమిటీలు పిలుపునిచ్చాయి.

# పత్తాలేని రాజాసింగ్!

- పార్టీ కార్యకలాపాలకూ దూరంగా సీనియర్ ఎమ్మెల్యే
- హైదరాబాద్, జహీరాబాద్‌లో ప్రచారానికి ప్లాన్
- ఎంపీ టికెట్ ఇవ్వకపోవడంతో అలిగినట్టు ప్రచారం
- ఎన్నికల వేళ మౌనం.. ఆందోళనలో అధిష్ఠానం



హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల వేళ బీజేపీకి సీనియర్ ఎమ్మెల్యే రాజాసింగ్ తలనొప్పిగా తయారయ్యారు. కొన్ని నెలలుగా పార్టీ కార్యకలాపాలన్నింటికీ దూరంగా ఉంటున్నారు. 'ఒకప్పుడు మేం పార్టీ నుంచి ఆయనను బహిష్కరించాం.. ఇప్పుడు ఆయన మా పార్టీని బహిష్కరించినట్టుగా కనిపిస్తున్నది' అని నేతలు చెప్పుకొనే స్థాయిలో రాజాసింగ్ దూరంగా ఉంటున్నారు. శనివారం కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర పదాధికారులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా అధ్యక్షులు, పార్లమెంట్ కన్వీనర్లు, ప్రభారీలు, మోర్చాల అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యేలు, పార్లమెంట్ ఎన్నికల అభ్యర్థులతో సమావేశం జరిగింది. దీనికి బీజేపీ జాతీయ కార్యదర్శి సునీల్ బన్సల్ కూడా హాజరయ్యారు. కానీ, రాజాసింగ్ డుమ్మా కొట్టారు. దీంతో బీజేపీ రాష్ట్ర నాయకత్వంపై రాజాసింగ్ తిరుగుబాటు చేసినట్టేనని పార్టీ వర్గాలు చెప్పుకుంటున్నాయి. ఆయనను ఎలా సముదాయించాలో తెలియక రాష్ట్ర నాయకత్వం తలలు పట్టుకుంటున్నది.

**బీజేపీఎల్పీ పదవి ఇవ్వకపోవడంతో అలక**

వాస్తవానికి రాజాసింగ్ డిసెంబర్ నుంచే పార్టీతో అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. అసెంబ్లీలో బీజేపీ పక్ష నేత పదవి ఇవ్వాలని రాజాసింగ్ కోరినా పార్టీ పెద్దలు ఒప్పుకోలేదు. అప్పటి నుంచి అంటీముట్టనట్టు వ్యవహరిస్తున్నారు. డిసెంబర్‌లో జరిగిన ఓ సమావేశంలో మధ్యలోనే అలిగి వెళ్లిపోయి, ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నారు. రాజాసింగ్ నోటి దురుసుతో అసెంబ్లీలో ఏదైనా మాట్లాడితే పరువు పోతుందనే ఉద్దేశంతో ఎల్పీ నేత పదవి ఇవ్వలేదని ప్రచారం జరిగింది. ఈ పరిణామాలతో ఎంపీగా పోటీ చేసి ఢిల్లీకి వెళ్లాలని రాజాసింగ్ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. జహీరాబాద్ లేదా హైదరాబాద్ టికెట్ ఆశించారని తెలిసింది. ఇక్కడా ఎదురుదెబ్బ తగలడంతో పూర్తిగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. హైదరాబాద్ టికెట్‌ను మాధవీలతకు కేటాయించిన సమయంలో 'హైదరాబాద్‌లో పోటీ చేయించడానికి మొగోడే దొరుకలేదా?' అంటూ పరుష పదజాలంతో వ్యాఖ్యానించారు. అయినా బీజేపీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

**రెండు నియోజకవర్గాల్లో ప్రచారానికి ప్లాన్**

లోక్‌సభ ఎన్నికల్లో హైదరాబాద్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల్లో రాజాసింగ్‌ను వాడుకోవాలని బీజేపీ భావించింది. హైదరాబాద్ పరిధిలోని హిందూ ఓటర్లను, జహీరాబాద్‌లో మహారాష్ట్ర ప్రభావం ఉన్న ప్రాంతాల్లో రాజాసింగ్‌తో ప్రచారం చేయిస్తే కలిసి వస్తుందని భావించింది. కానీ రాజాసింగ్ మాత్రం తప్పించుకు తిరుగుతున్నారు.

# బీసీ వర్సెస్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి...

సోమవారం హెచ్చరించడం అగ్నికి ఆజ్యం పోసినట్టుగా అయిందని నేతలు చెప్పుకుంటున్నారు. పార్టీలోని తాజా పరిణామాలు చూస్తుంటే 'బీసీ వర్సెస్ రెడ్డి'గా మారేటట్టు ఉందని సీనియర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పార్టీ మేలు కోరి సూచనలు చేస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించడం దేనికి సంకేతమని బీసీ నాయకులు ప్రశ్నిస్తున్నారు. రేవంత్‌రెడ్డిపై గతంలో కోమటిరెడ్డి సోదరులు, జగ్గారెడ్డి వంటి నేతలు ఎన్ని ఆరోపణలు చేసినా పల్లెత్తు మాట అనకుండా, ఈ రోజు బీసీ నాయకులను హెచ్చరించడం ఏమిటని నిలదీస్తున్నారు.

**వారిపై చర్యలేవీ?**

ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్కం ఠాగూర్‌కు డబ్బులు ఇచ్చి రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్ష పదవిని కొనుక్కున్నారని కోమటిరెడ్డి వెంకటరెడ్డి గతంలో ఆరోపించినా కాంగ్రెస్ అధిష్ఠానం స్పందించలేదు. మునుగోడు ఉపఎన్నిక సందర్భంగా బీజేపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన సోదరుడు రాజగోపాల్‌రెడ్డిని గెలిపించాలని వెంకట్‌రెడ్డి బాహాటంగా పిలుపునిచ్చారు. దీనిపై ఏఐసీసీ ఆయనకు షోకాజ్ నోటీసు ఇస్తే, దానిని చెత్తబుట్టలో పడేసినట్టు మీడియా ముఖంగా చెప్పినా ఆయనపై చర్యలు తీసుకోలేదు. రాజగోపాల్‌రెడ్డి అయితే తాను రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పనిచేయలేకే బీజేపీలో చేరినట్టు ప్రకటించారు. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అయితే పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డిని తప్పించని పక్షంలో తన పదవికి రాజీనామా చేస్తానని ఏకంగా రాహుల్‌గాంధీకే లేఖ రాశారు. అయినా క్రమశిక్షణ చర్య తీసుకుంటామని వీరిని హెచ్చరించిన దాఖలాలు లేవు. సీనియర్ బీసీ నాయకులు నిరంజన్, వీ హనుమంతరావు ఇద్దరూ ఎంపీ టికెట్ల కేటాయింపులో పార్టీనే నమ్ముకున్న వారికి అన్యాయం జరుగుతున్నదని అంటే మాత్రం క్రమశిక్షణ చర్యలు తప్పవని మరో బీసీ నాయకుడు మహేశ్‌కుమార్‌గౌడ్ హెచ్చరించడం పార్టీలో తీవ్ర చర్చకు కారణమైంది. పార్టీలో, ప్రభుత్వంలో బడుగు బలహీన వర్గాలు, బీసీ నాయకులపై ఒకలా, రెడ్డి సామాజికవర్గ నాయకులపై మరోలా పీసీసీ నాయకత్వం వ్యవహరిస్తున్నదన్న సీనియర్లు మండిపడుతున్నారు.

**మున్నూరు కాపు నేతలే లక్ష్యం**

రాష్ట్ర కాంగ్రెస్‌లో మున్నూరుకాపు సామాజిక వర్గం నాయకులకు టార్గెట్ చేస్తున్నారని రాష్ట్ర మున్నూరు కాపు యువక మండలి ప్రధాన కార్యదర్శి ఎస్పీ క్రాంతికుమార్ ఒక ప్రకటనలో ఆరోపించారు. పార్టీలో ఇటీవల జరుగుతున్న చేరికలు, ఎంపీ టికెట్ల కేటాయింపుపై పార్టీ సీనియర్లు తమ అభిప్రాయాలు వ్యక్తంచేస్తే తప్పేమిటని ప్రశ్నించారు. వివిధ అంశాలపై సీనియర్ నాయకులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేయడం కొత్త విషయం ఏమీ కాదని పేర్కొన్నారు. ఇటీవల కేంద్ర మాజీమంత్రి, సీనియర్ నేత ఆనంద్‌శర్మ కుల గణనపై తన అభిప్రాయాన్ని అధినాయకత్వానికి బాహాటంగానే తెలియజేశారని గుర్తుచేశారు. మరెంతోమంది నాయకులు తమ అభిప్రాయాలను లేఖల రూపంలో, మీడియా ద్వారా తెలియజేస్తున్నా వారిపై చర్యలు తీసుకుంటామని అధిష్ఠానం హెచ్చరించ లేదని తెలిపారు. ఇప్పుడు మాత్రం మున్నూరుకాపు సామాజికవర్గ నేతలు అభిప్రాయాలు వ్యక్తం చేస్తే వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించడం ఏమిటని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ల విషయంలోనూ మున్నూరుకాపు నేతలను పార్టీ తీవ్రంగా అవమానించిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 50 లక్షల పైగా జనాభా ఉన్న మున్నూరుకాపులకు బీఆర్ఎస్, బీజేపీ సముచిత స్థానం ఇస్తున్నాయని, కాంగ్రెస్ మాత్రం వారిని పొమ్మనలేక పొగబెట్టాలని చూస్తున్నదని ఆరోపించారు.

**పదవులు, పోస్టులు ఒక వర్గానికేనా?**

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పదవులు, ప్రభుత్వంలో కీలక శాఖలు రెడ్డి సామాజిక వర్గానికే దక్కాయన్న చర్చ పార్టీలో జరుగుతున్నది. నామినేటెడ్ పోస్టుల్లోనూ తమకు ప్రాధాన్యం లేని పోస్టులు కట్టబెట్టారని బీసీ నాయకులు వాపోతున్నారు. అసెంబ్లీ టికెట్లలో విషయంలో జరిగిన అన్యాయాన్ని పార్లమెంటు ఎన్నికల్లోనైనా సరిదిద్దుతారనుకుంటే ఇప్పుడు కూడా నిరాశే మిగిలిందని వాపోతున్నారు. మరోవైపు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కను చిన్నచూపు చూస్తున్నారని, మాదిగలకు పార్టీలో అన్యాయం జరుగుతున్నదని చెప్తున్నారు. ఇది ఇలాగే కొనసాగితే పార్టీకి ప్రమాదకరమని హెచ్చరిస్తున్నారు.

## రచ్చకెక్కితే సీనియర్లపైనా చర్యలు తప్పవు

**కాంగ్రెస్ అసమ్మతి నేతలకు పీసీసీ హెచ్చరిక**

హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ): అసమ్మతిపై రాష్ట్ర కాంగ్రెస్ కన్నెర్రజేసింది. అసమ్మతి గళాలను మొగ్గలోనే తుంచివేయాలని నిర్ణయించింది. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే ఎంతటి సీనియర్ నాయకుడైనా చర్యలు తప్పవని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ హెచ్చరించారు. పార్టీ సీనియర్ నేత, పీసీసీ ఉపాధ్యక్షుడు ఎల్ నిరంజన్, కాంగ్రెస్ కురువృద్ధుడు వీ హనుమంతరావు ఇటీవల పార్టీలో జరుగుతున్న పరిణామాలపై రచ్చకెక్కిన విషయం తెలిసిందే. పార్టీ వారికి కాదని బయటి నుంచి వచ్చిన వారికి ఎంపీ టికెట్లు ఇవ్వడాన్ని వీరు తప్పుపట్టారు. ఈ నేపథ్యంలో మహేశ్‌కుమార్ గౌడ్ పరోక్షంగా ఈ ఇద్దరు నాయకులను తీవ్రంగా హెచ్చరించారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే ఉపేక్షించేదని లేదని స్పష్టంచేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పార్టీ నిర్ణయాలకు వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. పార్టీ నిర్ణయాలను అందరూ ఆమోదించాల్సిందేనని స్పష్టం చేశారు. ఏవైనా అభిప్రాయభేదాలు ఉంటే పార్టీ అంతర్గత వేదికలపై స్పందించవచ్చని సూచించారు.

# కామ్రేడ్స్‌లో కన్ఫ్యూజన్?!

- లోక్‌సభ ఎన్నికల్లో పొడవని పొత్తులు
- ఇతర పార్టీలకు మద్దతుపై తర్జన భర్జన
- రాజకీయ సందిగ్ధంలో సీపీఎం, సీపీఐ

ఖమ్మం, మార్చి 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాష్ట్రంలో కమ్యూనిస్టు పార్టీలు కన్ఫ్యూజన్‌లో ఉన్నాయి.ఎన్నికల షెడ్యూల్ విడుదలై రాజకీయ పార్టీలు అభ్యర్థులను ప్రకటిస్తున్నా.. సీపీఎం, సీపీఐలు ఇంకా మీనమేషాలు లెక్కిస్తున్నాయి. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఒంటరిగా బరిలోకి దిగాలా ? లేక ఇతర రాజకీయ పార్టీలతో జట్టు కట్టాలా ? అనే అంశంపై తర్జన భర్జన పడుతున్నాయి. మతోన్మాద శక్తులను ఓడించాలన్న ఏకైక ధ్యేయంతో ముందుకెళ్లే కమ్యూనిస్టుపార్టీలు తీసుకునే నిర్ణయంపైనే ఇప్పుడు రాజకీయపరమైన చర్చ నడుస్తున్నది. ఇప్పటివరకు లౌకికవాద పార్టీలతో జట్టు కట్టిన సీపీఐ,సీపీఎంలు... సందర్భానుసారంగా కొన్నిసార్లు కలిసి, మరికొన్ని సార్లు వేర్వేరుగా లౌకికవాద పార్టీలకు స్నేహహస్తం అందించాయి. శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో జతకట్టిన సీపీఐ.. పొత్తులో భాగంగా కొత్తగూడెంను సాధించుకున్నది. సీపీఎం కూడా కాంగ్రెస్ పార్టీతో జట్టు కట్టాలని పావులు కదిపినా ఫలించలేదు. వైరా, మిర్యాలగూడ అసెంబ్లీ స్థానాలను ఆశించిన సీపీఎం డిమాండ్లను కాంగ్రెస్ పార్టీ పట్టించుకోలేదు. దీంతో అసెంబ్లీ ఎన్నికల్లో తనకు పట్టున్న స్థానాల్లో ఒంటరిగా బరిలోకి దిగిన సీపీఎం ఒక్క స్థానాన్ని కూడా గెలుచుకోలేదు.

**పార్లమెంట్‌పై పట్టువిడుపులు**

ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల షెడ్యూలు విడుదలైన నేపథ్యంలో వామపక్ష పార్టీలు ఇంకా పట్టువిడుపులపైనే ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లోలాగే పార్లమెంట్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు సీపీఐ స్నేహహస్తం అందించేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. తమకు వరంగల్ లేదా కరీంనగర్ లోక్‌సభ స్థానాన్ని కేటాయించాలని కోరినట్లు తెలుస్తున్నది. కానీ ఇప్పటికే వరంగల్ లోక్‌సభకు అభ్యర్థిని ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ పెద్దల నుంచి ఎటువంటి ప్రతిస్పందన రాలేదు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐ మధ్య పొత్తు పొడుస్తుందా ? లేదా ? అనేది కొంత కాలం గడిస్తే కానీ చెప్పే పరిస్థితులు కనిపించుట లేదు. సీపీఐ కూడా కాంగ్రెస్‌తో కలిసి నడువాలా ? లేక ఒంటరిగా బరిలోకి దిగాలా ? అనే సందిగ్ధంలో ఉన్నట్టు సమాచారం. గతంలో బీఆర్ఎస్‌కు మిత్రపక్షంగా వ్యవహరించిన సీపీఎం పట్టున్న స్థానాల్లో ఒంటరిగా బరిలోకి దిగుతుందా ? అని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తున్నది. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో ఆ పార్టీ బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపుతుందా..? లేదా కాంగ్రెస్ పార్టీ వైపు వెళ్తుందా..? అనే విషయంపై పార్టీ నేతలు చర్చించుకుని త్వరలో స్పష్టత ఇస్తారని తెలుస్తున్నది. లోక్‌సభ ఎన్నికలకు ఇంకా రెండు నెలల సమయం ఉంది. రెండు పార్టీల పయనంపై ఇకనైనా స్పష్టత వస్తుందేమో చూడాలి.

**మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ ప్రకటించిన బోనస్ ఇలా..**

| పంట | మద్దతు ధర (రూ.) | హామీ ధర(బోనస్) |
|---|---|---|
| ధాన్యం | 2,183 | 2,683 (500) |
| మొక్కజొన్న | 1,870 | 2,200 (330) |
| కందులు | 6,300 | 6,700 (400) |
| సోయాబీన్ | 3,950 | 4,400 (450) |
| పత్తి | 6,025 | 6,500 (475) |
| మిర్చి | - | 15,000 |
| పసుపు | - | 12,000 |
| ఎర్రజొన్న | - | 3,500 |
| చెరుకు | - | 4,000 |
| జొన్నలు | 2,758 | 3,050 (292) |



# అమాత్యా.. బోనస్!

**అటకెక్కిన పంట బోనస్ హామీ**

- పసుపుబోర్డు, పత్తికొనుగోలు కేంద్రాల కోసం కేంద్రానికి తుమ్మల లేఖలు
- ప్రయోజనం ఏమిటని రైతుల ప్రశ్న

హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ): తాము అధికారంలోకి వస్తే పంటలకు బోనస్ ఇస్తామని ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ ప్రకటించింది. అధికారంలోకి వచ్చాక ఇప్పుడా సంగతిని మర్చిపోయింది. బోనస్ సంగతి దేవుడెరుగు.. పంటలకు మద్దతు ధర కల్పించేందుకే వ్యవసాయశాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు నానా అవస్థలు పడుతున్నారు. ఇందుకోసం కేంద్ర సంస్థలకు లేఖలు రాస్తున్నారు. ఎప్పుడు ఏర్పాటవుతుందో తెలియని పసుపు బోర్డు కోసం, పత్తికొనుగోలు కేంద్రాల కొనసాగింపు కోరుతూ కేంద్రానికి లేఖలు రాశారు. ఈ రెండింటి వల్ల రైతులకు ఇప్పటికిప్పుడు లభించే ప్రయోజనం ఏమీ ఉండదు. అయినప్పటికీ తన లేఖలతో రైతులకు మేలు జరుగుతుందని చెప్తున్నారు. గత ప్రభుత్వం ఒకటిరెండు పంటలను కొనుగోలు చేసి మిగతా పంటలకు గిట్టుబాటు ధర అందించే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, ఫలితంగా రాష్ట్రంలో సాగు రెండుమూడు పంటలకే పరిమితమైందని ఈ సందర్భంగా మంత్రి విమర్శించారు. ఇప్పుడా పరిస్థితిని తప్పించేందుకు కేంద్ర సంస్థలకు లేఖలు రాసినట్టు వివరించారు.

**పంటల విక్రయానికి అవస్థలు**

పండించిన పంటలు అమ్ముకునేందుకు రాష్ట్రవ్యాప్తంగా రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. పత్తి, పసుపు, మిర్చి, వేరుశనగ రైతులు కష్టాలు చెప్పనలవి కాకుండా ఉన్నాయి. మద్దతు ధర కోసం రైతులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి నెలకొన్నది. కొన్ని పంటలకు మద్దతు ధర లేకపోగా, మరికొన్నింటికి దక్కినా అధికారులు, వ్యాపారుల నుంచి ఇబ్బం దులు ఎదురవుతున్నాయి. కేసముద్రం, మహబూబాబాద్ మార్కెట్లో మిర్చి పంటను కొనుగోలు చేయకుండా అధికారులు, వ్యాపారులు రైతులను ఇబ్బంది పెడుతున్నారు. వేరుశనగకు గిట్టుబాట ధర కల్పించాలంటూ అచ్చంపేట, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్‌లో రైతులు రోడ్డెక్కి ఆందోళన చేశారు. పత్తిని కొనుగోలు చేయకుండా సీసీఐ అధికారులు ఇబ్బంది పెడుతున్నారంటూ ఆదిలాబాద్‌లో రైతులు ఆందోళన చేశారు. పత్తికి మద్దతు ధర చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పలుచోట్ల తమ పంటలను అమ్ముకునేందుకు రైతులు ఆందోళనలు, ధర్నాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పరిస్థితి ఇలా ఉంటే ప్రభుత్వం మాత్రం అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ప్రకటనలు గుప్పించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**బోనస్ సంగతేంది?**

మద్దతు ధరపై వరికి క్వింటాలుకు అదనంగా రూ. 500 బోనస్ ఇస్తామని ఎన్నికల ప్రచారంలో ప్రకటించిన కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నాలుక మడతేసింది. ధాన్యానికి ప్రస్తుతం మద్దతు ధరకంటే అధికంగా లభిస్తున్నదని, కాబట్టి బోనస్ ఇవ్వాల్సిన పనిలేదని కాంగ్రెస్ సీనియర్ నేత కోదండరెడ్డి ఇటీవల చెప్పారు. ఇప్పుడు వ్యవసాయమంత్రి కూడా మద్దతు ధర కోసం కేంద్ర సంస్థలకు లేఖలు రాస్తుండడం విమర్శలకు తావిచ్చింది.